క్లుప్తంగా

తిరుమల బాలాజీకి తిరుప్పావడ సేవ


తిరుప్పావడ సేవ నిర్వహిస్తున్న దృశ్యం

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్‌లోని ఎస్‌టీబీఎల్ ప్రాంగణంలో కొలువైయున్న శ్రీ తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో గురువారం తిరుప్పావడ సేవ నిర్వహించారు. పులిహోరను రాశులుగా పోసి బాలాజీకు నైవేద్యంగా సమర్పించారు. శ్రీనివాసుని గద్యాన్ని పఠిస్తూ పూజలు చేశారు. అనంతరం పులిహోర ప్రసాదాన్ని భక్తులకు వితరణ చేశారు. దివ్యక్షేత్రం ట్రస్ట్ ప్రతినిధుల ఆధ్వర్యంలో పూజలు జరిగాయి.

కోక్ ఓవెన్స్ ఉత్పత్తి పెంపునకు సమష్టి కృషి


కోక్‌ఓవెన్స్ నూతన విభాగాధిపతి దుర్గాప్రసాద్‌ను సత్కరిస్తున్న నాయకులు

ఉక్కునగరం: కోక్‌ఓవెన్స్ నూతన విభాగాధిపతిగా బాధ్యతలు స్వీకరించిన దుర్గాప్రసాద్‌ను స్టీల్ ఐఎన్‌టీయూసీ నాయకులు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన్ను సత్కరించి, అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా దుర్గాప్రసాద్ మాట్లాడుతూ ప్లాంట్ ఉత్పత్తిలో కోక్‌ఓవెన్స్ కీలకమైందన్నారు. పని చేసే ప్రతి ఒక్కరికీ తగిన ప్రాధాన్యత కలిగేలా తన వంతు కృషి చేస్తానన్నారు. ఉత్పత్తి పెంపునకు సమష్టిగా కృషి చేద్దామని కోరారు. అంతకుముందు నాయకులు విభాగం సమస్యలను ఆయన దృష్టికి తెచ్చారు. కార్యక్రమంలో యూనియన్ చీఫ్ వైస్ ప్రెసిడెంట్ కొమ్ము ప్రసాద్, సహాయ ప్రధాన కార్యదర్శి గోపాలరాజు, విభాగం కార్యదర్శి వై.శ్రీనివాస్, ఆకుల నూకరాజు, ఎస్.నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

హైస్కూల్ రోడ్‌లో అన్న సమారాధన


అన్న సమారాధనలో పాల్గొన్న దేవన్‌రెడ్డి

గాజువాక: 67వ వార్డులోని ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం భారీ అన్న సమారాధన నిర్వహించారు. శరన్నవ రాత్రి ఉత్సవాల్లో భాగంగా గాజువాక జిల్లా పరిషత్ హైస్కూల్ రోడ్‌లో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి ప్రారంభించారు. అంతకుముందు ఆయన విజయదుర్గను దర్శించుకున్నారు. భారీ సంఖ్యలో భక్తులు అమ్మవారి ప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి పల్లా చినతల్లి, క్లస్టర్ అధ్యక్షులు రాజాన వెంకటరావు, ఎస్ఎండీ గౌస్, నాయకులు పల్లా పెంటారావు, అచ్చంనాయుడు, రామలక్ష్మి, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.


తూర్పుకాపులకు ఓబీసీ సర్టిఫికెట్ల మంజూరుకు వినతి

గాజువాక: గాజువాకలో నివాసముంటున్న తూర్పు కాపులందరికీ ఓబీసీ, బీసీ డీ సర్టిఫికెట్‌లను మంజూరు చేయాలని బీజేపీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు కోరారు. ఈ మేరకు ఆయన గాజువాక తహసీల్దార్ టి.శ్రీవల్లిని గురువారం కలిసి వినతిపత్రం సమర్పించారు. తూర్పు కాపులకు మైగ్రేషన్ సర్టిఫికెట్ అవసరం లేకుండా ఓబీసీ, బీసీ–డీ జారీ చేయాలని, దీనికి సంబంధించి కలెక్టర్ కూడా సర్క్యులర్ జారీ చేశారని పేర్కొన్నారు. ఈ సర్క్యులర్ ఆధారంగా తూర్పు కాపులకు న్యాయం చేయాలని కోరారు.

అభయ ప్రదాయిని.. శక్తి స్వరూపిణి


ఎల్‌వీనగర్ కనకదుర్గ ఆలయంలో లలితాదేవిగా ..


లలితా త్రిపుర సుందరి అలంకరణలో మహాదుర్గ


గజలక్ష్మి అవతారంలో శ్రీ మహాలక్ష్మి


జగద్విఖ్యాతగా శ్రీ మహాసరస్వతి


అర్ధనారీశ్వరి దేవి అలంకరణలో దుర్గాలమ్మ

- లలితాదేవిగా దుర్గామాత దర్శనం
- వేడుకగా శరన్నవరాత్రి మహోత్సవాలు


కన్యకపరమేశ్వరి ఆలయంలో ధనలక్ష్మిగా..


సిద్ధేశ్వరం ఆలయంలో కాత్యాయనిగా దుర్గాదేవి


కన్యకా పరమేశ్వరి ఆలయంలో సామూహిక కుంకుమ పూజల్లో పాల్గొన్న మహిళలు

గాజువాక: దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు నియోజకవర్గ పరిధిలో నేత్రపర్వంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా అమ్మవారిని లలితాదేవిగా అలంకరించి, భక్తులకు దర్శనాలు కల్పించారు. ఆలయాల్లో సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు.

- 70వ వార్డు ఎల్వీ నగర్ కనకదుర్గ ఆలయంలో అమ్మవారిని లలితాదేవిగా అలంకరించారు. ఈ సందర్భంగా మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు భారీ సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. పూజల అనంతరం ప్రసాద వితరణ చేశారు.

కన్యకాపరమేశ్వరి ఆలయంలో కుంకుమార్చన

దసరా ఉత్సవాల్లో భాగంగా స్థానిక కన్యకా పరమేశ్వరి ఆలయంలో మహిళలు సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. అమ్మవారిని ధనలక్ష్మిగా అలంకరించారు. ఆర్యవైశ్య సంఘం, ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో పూజలు జరిగాయి.

త్రిశక్తి ఆలయంలో సహస్ర కమల పుష్పార్చన

ఉక్కునగరం: స్థానిక త్రిశక్తి ఆలయంలో గురువారం శ్రీ మహాదుర్గకు సహస్ర కమల పుష్పార్చన నిర్వహించారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శ్రీ మహాదుర్గ అమ్మవారు లేత గులాబీ వర్ణం చీరలో లలితా త్రిపుర సుందరిగా.. శ్రీమహాలక్ష్మి అమ్మవారు ఆకుపచ్చ వర్ణం చీరలో గజలక్ష్మిగా.. శ్రీ మహాసరస్వతి అమ్మవారు ఆకుపచ్చ వర్ణం చీరలో జగద్విఖ్యాత అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. సాయంత్రం మహిళలతో సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు ఫణిశర్మ నేతృత్వంలో అమ్మవార్లకు నవరసాభిషేకాలు, ప్రత్యేక పూజలు అనంతరం చండీ హోమం జరిగాయి. ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

అర్ధనారీశ్వరిగా దుర్గాలమ్మ

అగనంపూడి: అగనంపూడిలోని దుర్గాలమ్మ ఆలయంలోని అమ్మవారు అర్ధనారీశ్వరి (మహా చండీశ్వరి దేవి)గా భక్తులకు దర్శనమిచ్చారు. పరిసర గ్రామాలకు చెందిన భవానీలు, భక్తులు పాల్గొని అమ్మవారికి విశేష పూజలు చేశారు. ఆలయం వద్ద శుక్రవారం మధ్యాహ్నం విశేష అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ చిత్తా గణేష్ తెలిపారు.

ధనలక్ష్మి అలంకరణలో..

పెదగంట్యాడ: 76వ వార్డు వాసవీ కన్యకాపరమేశ్వరి పంచాయతన ఆలయంలో కన్యకాపరమేశ్వరి అమ్మవారు ధనలక్ష్మి అలంకరణలో దర్శనమిచ్చారు. అమ్మవారిని రూ.2లక్షల 29వేలు కరెన్సీ నోట్లతో అలంకరించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

- 74వ వార్డు సిద్ధేశ్వరం దుర్గాదేవి ఆలయంలో అమ్మవారు కాత్యాయనీ దేవిగా దర్శనమిచ్చారు. మిత్తిన అప్పలరెడ్డి, గొరుసు సత్యారావు, బస అప్పలరెడ్డి, చినఅప్పారావు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

విండ్‌బాల్ క్రికెట్ టోర్నీ ప్రారంభం


క్రికెట్ టోర్నీ ప్రారంభిస్తున్న నరసింగరావు

పెదగంట్యాడ: క్రీడల్లో రాణించే వారికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని బీజేపీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు అన్నారు. గంగవరంలో బీఎస్ఎన్ఎల్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విండ్‌బాల్ క్రికెట్ టోర్నమెంట్ పోటీలను గురువారం ఆయన ప్రారంభించారు. ప్రథమ బహుమతిగా రూ.6 వేలు ద్వితీయ బహుమతిగా రూ.4 వేలు, తృతీయ బహుమతిగా రూ.2వేలతో పాటు ట్రోఫీలను అందజేస్తామన్నారు. కార్యక్రమంలో పేర్ల అప్పారావు, బడి తాతారావు, ధనరాజ్, నూకరాజు, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాభివృద్ధితో మెండుగా అవకాశాలు


మాట్లాడుతున్న కౌశిక్ అగస్త్య

అగనంపూడి: విద్యార్థులు జీవన నైపుణ్యాలు పెంచుకుంటే జీవితంలో మంచి గమ్యాన్ని చేరుకుంటారని కెరీర్ గైడెన్స్ మోటివేటర్ కౌశిక్ అగస్త్య అన్నారు. దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాలలో కెరీర్ గైడెన్స్‌పై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. భవిష్యత్తులో అవకాశాలను అందిపుచ్చుకోవాలంటే ఎటువంటి నైపుణ్యాలను అలవర్చుకోవాలి, పోటీ పరీక్షలు, పరీక్షల విధానంపై వివరించారు. కళాశాల రెక్టార్ వి.మధుసూదనరావు మాట్లాడుతూ బీటెక్ పూర్తి చేసిన తరువాత ఉద్యోగాలు పొందాలనుకునే విద్యార్థులకు కేవలం పాఠ్యాంశాలపై అవగాహన, పరిజ్ఞానం ఉంటే సరిపోదని, పోటీ పరీక్షలకు తగిన తర్ఫీదు అవసరమన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జె.సుధాకర్, సీఈవో ఎన్.శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఎన్‌ఐపీఎం స్టూడెంట్ చాప్టర్ ప్రారంభం


స్టూడెంట్ చాప్టర్ కార్యక్రమంలో పాల్గొన్న ఎన్ఐపీఎం ప్రతినిధులు, విద్యార్థులు

ఉక్కునగరం: నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పర్సనల్ మేనేజ్‌మెంట్ (ఎన్ఐపీఎం) విశాఖ చాప్టర్ ఆధ్వర్యంలో స్టూడెంట్ చాప్టర్ ప్రారంభమైంది. ఎన్ఐపీఎం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వాల్తేరు బిజినెస్ స్కూల్‌కు చెందిన ఎంబీఏ, బీబీఏ విద్యార్థులు పాల్గొన్నారు. ఎన్ఐపీఎం ఎగ్జిక్యూటివ్ కమిటీ ప్రతినిధులు హాజరై ఎన్ఐపీఎం ఉపయోగాలను వివరించారు. ఎన్ఐపీఎం సేవ ధ్యాన్ని తెలియజేసి, పాఠ్యపుస్తకాలను అందజేశారు. విద్యార్థులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కళాశాల సీనియర్ అధ్యాపకులు కిరణ్ కుమారి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ యుగంధర్, ఎన్ఐపీఎం చాప్టర్ కార్యదర్శి బి.శేషగిరిరావు, చైర్మన్ డాక్టర్ సుధాకర్, డాక్టర్ మురళీధర్, ఇతర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

అప్పలనాయుడికి సత్కారం


అప్పలనాయుడిని సత్కరిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

అగనంపూడి: కాంగ్రెస్ పార్టీ కార్మిక విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులైన అగనంపూడి పెదమడకకు చెందిన నాయకుడు దానబాల అప్పలనాయుడును స్థానిక ప్రజా సంఘాల నాయకులు ఘనంగా సత్కరించారు. స్థానికంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అప్పలనాయుడు మాట్లాడుతూ తన సేవలను గుర్తించి, ఈ పదవిలో నియమించిన పార్టీ అధిష్టానానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో దువ్వాడ రైల్వే కన్సల్టెన్సీ కమిటీ సభ్యుడు కొలిపాక అప్పారావు, వి.వరహాలు, బి.సత్యనారాయణ, కె.పైడిరాజు, ఎస్.సన్యాసిరావు, బి.హరిబాబు, ఎస్.రమణ తదితరులు పాల్గొన్నారు.

జీవీఎంసీ కమిషనర్ దృష్టికి 68వ వార్డు సమస్యలు


కమిషనర్ సాయికాంత్ వర్మకు సమస్యలు వివరిస్తున్న కార్పొరేటర్ అనూష

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డులో పలు సమస్యలను పరిష్కరించాలని కార్పొరేటర్ గుడివాడ అనూష జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మను కోరారు. జీవీఎంసీ కౌన్సిల్ సమావేశాల అనంతరం ఆమె కమిషనర్‌ను కలిసి వార్డులో సమస్యలను వివరించారు. వినతిపత్రం అందించి, సమస్యలు పరిష్కరించాలని కోరారు.

యువకుడి ఆత్మహత్య

మర్రిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా.. 104 ఏరియా ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో తన అన్నయ్యతో కలిసి నివసిస్తున్న మణి(21) బుధవారం అర్ధరాత్రి దాటాక చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడు, అన్నయ్య కలిసి అదే ప్రాంతంలో ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్నారు. ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ సమస్యలు తాళలేక ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మణి సోదరుడు టింకు ఫిర్యాదు మేరకు సీఐ సాయి నేతృత్వంలో హెచ్‌సీ ప్రకాష్‌రావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చురుగ్గా 'బీఆర్‌టీఎస్' పనులు

గోపాలపట్నం: గోపాలపట్నంలో బీఆర్‌టీఎస్ రోడ్డు పనులు చురుగ్గా సాగుతున్నాయి. బీఆర్‌టీఎస్‌తో పాటు సర్వీస్ రోడ్డు పనులకు జీవీఎంసీ నిధులు రూ.3.69 కోట్లతో ఇటీవల శంకుస్థాపన చేశారు. ముందుగా బీఆర్‌టీఎస్ రోడ్డు పనుల నిమిత్తం బాజీ జంక్షన్ నుంచి శ్మశానవాటిక కూడలి వరకు వాహనాలను బ్లాక్ చేశారు. రాత్రి సమయాల్లోనూ పనులు జరుగుతుండటంతో మరింత వేగం పుంజుకున్నాయి.

పేదలకు చేరువగా వైద్యసేవలు

- 'జగనన్న ఆరోగ్య సురక్ష'తో నాణ్యమైన వైద్యం
- ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి


దయాల్‌నగర్ శిబిరంలో మందులు అందిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి, కార్పొరేటర్ వంశీరెడ్డి


రోగిని పరీక్షించి మందులు రాస్తున్న పీహెచ్‌సీ వైద్యాధికారి మానస


74వ వార్డులో కంటి పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ విజయక్ష్మి

పెదగంట్యాడ: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలకు వైద్యసేవలు మరింత చేరువయ్యాయని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. ఒక్క రూపాయి ఖర్చు లేకుండా ప్రజలకు నాణ్యమైన వైద్యం అందుతోందన్నారు. జీవీఎంసీ 74వ వార్డు దయాల్ నగర్–3 సచివాలయ పరిధిలో పాత పోలీసు క్వార్టర్స్ ఎదురుగా సచివాలయం వద్ద కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా ఒక్క రూపాయి ఖర్చు లేకుండా పేదలందరికీ కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని ఉచితంగా అందించాలనే లక్ష్యంతో జగనన్న ప్రభుత్వం పని చేస్తోందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రతి ఒక్కరికీ ఆరోగ్య భరోసా లభిస్తుందన్నారు. ఇంటింటికీ వైద్య సిబ్బందిని పంపించి వారి ఆరోగ్య సమస్యలు తెలుసుకున్నారన్నారు.

302 మందికి వైద్యసేవలు

శిబిరంలో 302 మందికి 8 మంది వైద్యులు సేవలు అందించారు. యూపీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మానస, డాక్టర్ బి.రాజు, డాక్టర్ ప్రియాంక, డాక్టర్ విజయలక్ష్మి, డాక్టర్ రాజీవ్‌కుమార్, యశ్వంత్‌రెడ్డి, డాక్టర్ హేమసాయి, డాక్టర్ కిరణ్మయి పాల్గొని, రోగులను పరీక్షించారు. సిబ్బంది రక్తపరీక్షలు, ఇతర వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జోన్–6 జోనల్ కమిషనర్ పి.సింహాచలం, డాక్టర్ జీవన్‌రాణి, డాక్టర్ కిరణ్‌కుమార్, వెంకటలక్ష్మి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నరసింగరావు తదితరులు పాల్గొన్నారు.

75వ వార్డులో..

జీవీఎంసీ 75వ వార్డు సీతానగరం సచివాలయ పరిధిలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి ప్రారంభించారు. 225మందికి 5గురు వైద్యులు సేవలు అందించారు.

కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ రమేష్‌బాబు, డాక్టర్ హేమలత, వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు గొందేశి శ్రీనివాసరెడ్డి, డాక్టర్ జీవన్‌రాణి, డాక్టర్ కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యం

కూర్మన్నపాలెం: పేద ప్రజలకు మెరుగైన వైద్యాన్ని ఉచితంగా అందిస్తూ ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌ను నిర్మించాలనే లక్ష్యంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని తీసుకువచ్చారని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. జీవీఎంసీ 86వ వార్డు భరత్‌నగర్–1 శ్రామికనగర్ యూపీహెచ్‌సీ పరిధిలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు. యూపీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ నళిని పుష్పలత, డాక్టర్ భానుజతో పాటు ఈఎన్‌టీ స్పెషలిస్ట్, చర్మవ్యాధులకు సంబంధించి డెర్మటాలజిస్ట్, ఆర్థోపెడీషియన్, డెంటిస్ట్ సేవలు అందించారు. యూపీహెచ్‌సీ పరిధిలో మొత్తం 200మందికి టోకెన్లు జారీ చేయగా, 183 మంది వైద్య శిబిరానికి హాజరై వైద్య సేవలను పొందారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు దామా సుబ్బారావు, మెడికల్ బాబు, వాడపల్లి రామచంద్రరాజు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

కణితి పీహెచ్‌సీలో కొనసాగుతున్న సేవలు

జీవీఎంసీ 87వ వార్డు కణితి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గణేష్‌నగర్–02 ప్రజల సౌకర్యార్థం గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. ఎమ్మెల్యే నాగిరెడ్డి శిబిరాన్ని పరిశీలించారు. శిబిరంలో సుమారు 300 మంది ప్రజలు వైద్య సేవలను పొందినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఏఎంహెచ్‌వో కిరణ్‌కుమార్, 87వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి కోమటి శ్రీనివాసరావు, జేసీఎస్ కన్వీనర్ వాడపల్లి రామచంద్రరాజు, బొడ్డ గోవింద్ తదితరులు పాల్గొన్నారు.


భరత్‌నగర్‌లోని వైద్య శిబిరంలో రోగులకు మందులు అందిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి


భరత్‌నగర్ వైద్య శిబిరంలో వివరాలు నమోదు చేసుకుంటున్న రోగులు

ఏపీఐఐసీ నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి కృషి

- ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి
- ఆర్డీవో ఆధ్వర్యంలో గ్రామ సభ


నిర్వాసితుల సమస్యలపై మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

కూర్మన్నపాలెం: వడ్లపూడి ఏపీఐఐసీ నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. జీవీఎంసీ 87వ వార్డు వడ్లపూడి సచివాలయం వద్ద ఆర్డీవో హుస్సేన్‌సాహెబ్ అధ్వర్యంలో వడ్లపూడి ఏపీఐఐసీ నిర్వాసితుల సమస్యలపై గురువారం గ్రామసభను నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే నాగిరెడ్డి, ఏపీఐఐసీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (భూసేకరణ) మాధవి, గాజువాక తహసీల్దారు శ్రీవల్లి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నిర్వాసితుల సమస్యలు త్వరలోనే పరిష్కారమవుతాయన్నారు. అవార్డులు ఉండి భూమి కోల్పోయిన నిర్వాసితులకు న్యాయం చేస్తామన్నారు. లిస్ట్‌లో పేరు లేని నిర్వాసితులు సరైన ఆధారాలతో ఆర్డీవో కార్యాలయాన్ని సందర్శించాలని కోరారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కర్ణవానిపాలెం స్టీల్‌ప్లాంట్ నిర్వాసితుల ఇళ్ల స్థలాలు, ఫార్మాసిటీ నిర్వాసితుల సమస్యలు, ఏపీఐఐసీ నిర్వాసితుల సమస్యలను పరిష్కరించిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో 87వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి కోమటి శ్రీనివాసరావు, బొడ్డ గోవింద్, ప్రగడ వేణుబాబు, కోమటి రమాదేవి, ఎన్నేటి రమణ, చిత్రాడ రమణ, ముద్దపు దామోదర్, దుగ్గపు దానప్పలు తదితరులు పాల్గొన్నారు.

'జిందాల్‌ను స్టీల్‌ప్లాంట్‌లోకి అనుమతించం'


సమావేశంలో ప్రసంగిస్తున్న అయోధ్యరామ్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లోకి జిందాల్‌ను అనుమతించే ప్రసక్తి లేదని స్టీల్‌ప్లాంట్ కార్మిక నాయకులు స్పష్టం చేశారు. బ్లాస్ట్‌ఫర్నేస్–3ను జిందాల్‌కు అప్పగించాలని యాజమాన్యం ప్రయత్నిస్తున్న నేపథ్యంలో కార్మిక సంఘాలను, కార్మికులను చైతన్యపరిచేందుకు విభాగాల్లో ప్రచారం చేస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం ఇంజినీరింగ్ షాప్స్‌కు చెందిన సెంట్రల్ మిషన్ షాప్‌లో నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో నాయకులు మాట్లాడారు. ప్లాంట్ మొత్తం ప్రైవేటీకరణ ప్రక్రియపై ఆటంకాలు ఏర్పడుతున్న నేపథ్యంలో ఇలా ఒక్కొక్క విభాగాన్ని ప్రైవేటు వ్యక్తులకు అప్పగించాలన్న కుట్ర జరుగుతోందన్నారు. బీఎఫ్–3ను ప్రైవేటు వ్యక్తులకు అప్పగిస్తే విశాఖ ఉక్కు మనుగడకు ప్రమాదం అవుతుందన్నారు. యాజమాన్యం ఈ ప్రయత్నాన్ని నిలిపివేయపోతే ఆందోళన మరింత ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో జె.అయోధ్యరామ్, వై.టి.దాస్, వై.మస్తానప్ప, జె.రామకృష్ణ, జి.ప్రభాకర రెడ్డి, జి.గణపతిరెడ్డి, పరంధామయ్య, బి.డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా భాగస్వామ్యంతోనే 'ఉక్కు' పరిరక్షణ

- ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు
- 980వ రోజుకు రిలే దీక్షలు


980వ రోజు ఉక్కుదీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు కర్మాగారం పరిరక్షణకు కార్మికులు చేస్తున్న ఉద్యమం వారి పోరాట శక్తికి నిదర్శనమని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలి వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారం నాటికి 980వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు, ఓబీసీ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఉక్కు పరిరక్షణ ఉద్యమంలో ప్రజలందరినీ భాగస్వాములు చేయాలని కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. ప్రజా భాగస్వామ్యంతోనే ఉక్కు పరిరక్షణ సాధ్యమన్నారు. ఉక్కు పరిశ్రమను కాపాడుకుంటేనే కార్మికులకు భవిష్యత్తు ఉంటుందన్నారు. కర్మాగార పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ఉద్యమించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు


స్వర్ణ పుష్పాలతో స్వామికి అర్చన చేస్తున్న అర్చకుడు

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు విశేషంగా నిర్వహించారు. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణ పుష్పార్చన వైభవంగా జరిపించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ కల్యాణ మండపంలో వేదికపై వేంజేపచేశారు. విశ్వక్సేనపూజ, పుణ్యాహవచనం నిర్వహించారు. అష్టోత్తర శతనామావళి పఠిస్తూ 108 స్వర్ణ సంపెంగ పుష్పాలతో స్వామికి అర్చన చేశారు. విశేషంగా హారతులు అందజేశారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

ఘనంగా నిత్య కల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామికి గురువారం నిత్యకల్యాణం ఘనంగా నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలో స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై వేంజేపచేసి ఉదయం 9.30 గంటల నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు.